క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేతగా యాడికి పోలీస్ స్టేషన్ జట్టు



విజేతకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయం వెనుక నిర్వహించిన శ్రీ సాయి క్రికెట్ టోర్నమెంట్‌లో యాడికి పోలీస్‌స్టేషన్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు ఎస్‌ఐ వెంకటరమణ, సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ రఫి, స్టాంప్ రైటర్ రజాక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టోర్నమెంటులో 60 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన యాడికి పోలీసు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 98 పరుగులు సాధించగా అనంతరం బ్యాటింగ్ చేసిన పెద్దపప్పూరు జట్టు 93 పరుగులు సాధించి 6 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. విన్నర్ జట్టుకు రూ.20వేలతో పాటు ట్రోఫీని ఆయిల్ మిల్ యజమాని సర్దార్ అలీ, సీపీఐ మండల కార్యదర్శి మహమ్మద్ రఫీ అందజేశారు. రన్నర్ జట్టుకు బీఎన్‌బీవీఎస్ ట్రేడర్స్ యాజమాన్యం రూ.10 వేలను అందజేసింది. మూడో స్థానంలో నిలిచిన యాడికి జూటూరు సర్దార్ జట్టుకు వై.పురుషోత్తం రూ.5వేలను అందజేశారు. కార్యక్రమంలో జూటూరు బ్రదర్స్, ఇస్మాయిల్, అమీర్‌బాషా, మహమ్మద్ రబ్బాని, సర్దార్, ఫిరోజ్, సోయబ్, నిర్వాహకులు జక్కా నాగరాజు, గురు, హరి, రవి, అరుణ్, అంజి బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం



ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుడు పరిశుద్ధుడు గనుక మనం కూడా పరిశుద్ధంగా జీవించాలన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

'దళితులపై వివక్ష తగదు'

గార్లదిన్నె: రాష్ట్రంలో దళితులపై దాడులు, వివక్షత కొనసాగుతున్నాయని, దళిత అధ్యాపకుడిపై కుల వివక్ష చూపడం దారుణమని అనంతపురం డివిజన్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు లోలూరు కుళ్లాయప్ప మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో డెయిరీ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న రవివర్మపై అగ్రవర్ణ అహంకారంతో తోటి అధికారులే కుల వివక్షత చూపడం తగదన్నారు. దళిత అధ్యాపకుడి ఛాంబర్‌లో టేబుల్, కుర్చీలు తొలగించడంతో.. నేలపై కూర్చొని విధులు నిర్వహిస్తున్నారన్నారు. దళితుడనే కారణంతో మానసికంగా ఇబ్బందులు గురిచేయడం దారుణమన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

యాడికి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన సూచించారు. హాజరు కాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

యల్లనూరు: మండల కేంద్రంలోని కోట ప్రాథమిక పాఠశాలలో ఆదివారం తాడిపత్రి ఏఎస్ఆర్ ఆస్పత్రి గైనకాలజిస్టు అనూష రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 90 మంది మహిళలు వైద్య సేవలకు తరలివచ్చారు. కొందరు మహిళలను మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు.

చినుకు పడితే చిత్తడే..



చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిన రోడ్డు

గుంతకల్లు: పట్టణంలోని అంజలి నగర్‌లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే మట్టి రోడ్లు వాన నీటితో చిత్తడిగా మారుతున్నాయి. ద్విచక్ర వాహనాదారులు, పాదచారులు జారి పడుతున్నారు. అంజలి నగర్‌లో దాదాపు వందలాది కుటుంబాలు నివాసముంటున్నాయి. మున్సిపల్ అధికారులు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో విషపురుగులు సంచారిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నప్పటికీ మౌలిక వసుతులు కల్పించడంతో విఫమయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



రామన్న జిన్నా వీధిలో నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం, బావి వీధిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హంపయ్య కాలనీలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. కాలనీలోని రామన్న జిన్నా వీధిలో ఒకటి, బావి దగ్గర మరో రెండు విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగాయి. దీంతో ఆ విద్యుత్ స్తంభాలు ఎప్పుడు నేలకొరిగి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అసలే వర్షాకాలం, ఆపై ఆ కాలనీ మొత్తం నల్లరేగడి నేలలు. పైగా ఆ మూడు స్తంభాలకు పలు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. దీంతో పిల్లల్ని ఆడుకునేందుకు బయటికి పంపాలంటేనే భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నేలకొరిగేందుకు సిద్ధంగా ఉన్న వాటిని తొలగించడమో లేక మరమ్మత్తులు చేయించి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

తాగునీరు వృథా



కొళాయి సరిగా లేక వృథాగా పోతున్న నీరు

పెద్దపప్పూరు: మండలంలోని సోమనపల్లిలో కొళాయి పాడవడంతో తాగునీరు వృథా అవుతోంది. సోమనపల్లి నుంచి వజ్రగిరి నరసింహస్వామి గుడికి వెళ్లే రోడ్డు మలుపులో తాగునీటి ట్యాంకు వద్ద నీరు లీకేజీ అవుతున్నా తగుచర్యలు చేపట్టలేదని గ్రామస్తులు అధికారులపై విమర్శలు కురిపిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య వేధిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. తాగునీరు ఉన్న గ్రామాల్లో ఇలా వృథాగా పోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం



గుత్తి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయంలో గుత్తి మున్సిపాలిటీ అనుబంధ సంఘాలను నియమించారు. బీసీ విభాగం కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బోయ పవన్ కుమార్, రంగనాయకులు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సత్య ప్రియాంక, బేబీ, బూత్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రమేష్‌రెడ్డి, భాస్కర్ బాబు, క్రిస్టియన్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా గద్దల నాగేంద్ర బాబు, సురేంద్రబాబు, సాంస్కృతిక విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ రహీం, తలారి హరీష్, దివ్యాంగుల విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నాగరాజు, రాజశేఖర్, గ్రీవెన్స్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రంగ ప్రసాద్ రాయల్, రాము నియమితులయ్యారు. ఇంటలెక్చువల్స్ ఫోరం విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాజేంద్ర ప్రసాద్, చంద్రశేఖర్, ఐటీ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ సులేమాన్, సాయినాథ్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా హేమలత, భాగ్యలక్ష్మి, ముస్లిం మైనార్టీ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కటిక అన్వర్ బాషా(ఖురేషి), సికిందర్ బాషా, మున్సిపల్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ షఫి, శ్రీకరం ధనుంజయ, పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రవి కుమార్, నాగరాజు, ప్రచారం విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ రవూఫ్, విశ్వనాథ్ ఆచారిని నియమించారు. రైతు విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా దివాకర్ రెడ్డి, ఎద్దుల భాస్కర్, ఎస్సీ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మల్లికార్జున, రామాంజనేయులు, సోషల్ మీడియా విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వరదరాజులు, మహబూబ్ బాషా, ఎస్టీ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా విజయ్, సురేంద్ర, విద్యార్థి విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఇమ్రాన్, నాసిర్ అహ్మద్, వాణిజ్య విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రాం మోహన్, ఖాసీం పీరా, వలంటీర్ల విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా బోయ శివ,ప్రసాద్, యువజన విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మురళి, ఆరిఫ్, వైఎస్ఆర్ టీయూసీ విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రఫి, ఇస్మాయిల్‌ను నియమించారు.

కులాల మధ్య చిచ్చు పెట్టడం మీకే చెల్లు



మాట్లాడుతున్న రాజశేఖర్ రెడ్డి

గుత్తి: కులాల మధ్య చిచ్చు పెట్టడం టీడీపీకే చెల్లు అని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. గుత్తిలో ఆదివారం ఆయన వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు గోపినాథ్ రెడ్డి, లక్ష్మరెడ్డి, శ్రీనివాస రెడ్డి, సుభాష్ చంద్రబోస్ రెడ్డి, అమర్నాథ్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీలో ప్రెస్‌మీట్ పెట్టే దమ్ము రెడ్లకు లేదని అందుకోసమే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులతో మాట్లాడించారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రెడ్లు ఎప్పుడూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలను అక్కున చేర్చుకుంటారన్నారు. మీ పార్టీ నాయకులు మాదిరిగా కులాల మధ్య చిచ్చు పెట్టమన్నారు. రెడ్లను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పోటీ చేయకుండా చూస్తానని, ఒక వేళ పోటీ చేస్తే కోసి సున్నం పెడతానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వ్యాఖ్యానించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. అలాంటి మాటలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేసి గెలుస్తామని, దమ్ముంటే అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

'నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు'

యాడికి: గ్రామాల్లో ఫర్టిలైజర్స్ యజమానులు నకిలీ విత్తనాలు, మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ మహబూబ్ బాషా హెచ్చరించారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు, మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ ఫోన్ లో ఫిర్యాదు చేస్తున్నారన్నారు. గుర్తింపు పొందిన విత్తనాలు, మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. అలాగే విత్తనాలు, మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు, మందుల వల్ల రైతులు నష్టపోతే సంబంధిత షాపు నిర్వాహకులు పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మిగులు సీట్ల భర్తీ కోసం 24న పరీక్ష

పుట్లూరు: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల (6,7,8,9వ తరగతులు) భర్తీ కోసం ఈ నెల 24వ తేదీన నిర్వహించే పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని ఆ ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి ఆదివారం తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 24వ తేదీ ఉదయయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

వ్యక్తి మృతి

గుత్తి: పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన షేక్షావలి అనే వ్యక్తి ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. షెక్షావలి ఇంట్లో ఉన్నఫళంగా కుప్పకూలి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అరెస్ట్

తాడిపత్రిటౌన్: మండలంలోని సజ్జలదిన్నెకు చెందిన దూదేకుల దస్తగిరి 2029లో అధికారంలోకి వస్తే రప్పా..రప్పా నరుకుతాం అంటూ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేసినందుకు ఆదివారం అరెస్టు చేశామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఆదివారం బైక్‌ను ఆటో ఢీ కొన్న ఘటనలో రాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. విడపనల్లుకు చెందిన రాజు బైక్‌లో వెళ్తుండగా వెనుక నుంచి ఆటో ఢీ కొనింది. ప్రమాదంలో గాయపడిన రాజును స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళకు గాయాలు

గుత్తిరూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం బైక్ నుంచి పడి బందెమ్మ అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని టి.కొత్తపల్లికి చెందిన బందెమ్మ పని నిమిత్తం తన బంధువుతో కలిసి ద్విచక్రవాహనంలో వన్నేదొడ్డి గ్రామానికి వెళ్లింది. అక్కడ పని ముగించుకుని గ్రామానికి తిరిగి వెళ్తుండగా ద్విచక్రవాహనంలో వెనుక వైపు కూర్చున్న బందెమ్మ ప్రమాదవశాత్తు జారి కింద పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలపై మమకారం.. ఏటా సహకారం



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు పంపిణీ చేస్తున్న రిటైర్డు అధ్యాపకుడు నందవరం కేశవరెడ్డి (ఫైల్)

పెద్దపప్పూరు: తాను చదువుకున్న పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఓ విశ్రాంత అధ్యాపకుడు ఏటా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాలిలా.. పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరుకు చెందిన రిటైర్డు అధ్యాపకుడు నందవరం కేశవరెడ్డి అదే గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి వరకూ చదువుకున్నారు. ఆపై ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. ప్రస్తుతం తాడిపత్రి పట్టణంలో నివాసముంటున్న ఆయన ఏటా పెద్దయక్కలూరు పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ రూ.3 వేలు అందిస్తున్నారు. అలాగే పరీక్షల సమయంలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలలో ఎంతో మంది విద్యావంతులు కావాలనే లక్ష్యంతోనే విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులకు జూలై 2న ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్‌హౌస్

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది ఒడ్డున అనంతపురం బీసీసీ రోడ్డుకు గల సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుగా మారింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక సింగరప్ప కొండ సమీపాన గల పెన్నానది నుంచి పెద్ద యంత్రాల ద్వారా పైప్‌లైన్ ద్వారా నీరు స్థానిక పంప్‌హౌస్‌లోని బావిలోకి సరఫరా అవుతుంది. ఇక్కడ నుంచి నీరు పామిడితో పాటు గుత్తి, నంద్యాల, కర్నూలు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు పంపింగ్ చేసేందుకు 25 ఏళ్ల క్రితం పంప్‌హౌస్ నిర్మించారు. ఈ పంప్‌హౌస్ మందు ప్రియులకు, పేకాటరాయుళ్లకు, రాత్రి వేళ ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొందరు ఆకతాయిలు మద్యం సేవించి ఖాళీ మద్యం బాటిళ్లను పంప్‌హౌస్ బావిలోకి పడేస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తక్షణం స్పందించి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టి సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను సంరక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా జనరేటర్



సాయినగర్‌లో తుప్పపట్టిన జనరేటర్

గుంతకల్లుటౌన్: పాలశీతలీకరణ కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఎటువంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన జనరేటర్ నిరుపయోగంగా ఉంది. పట్టణంలోని సాయినగర్‌లోని అగ్రికల్చర్ ఏఓ కార్యాలయం కింద గతంలో ఏర్పాటు చేసిన పాలశీతలీకరణ కేంద్రం నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కొన్నేళ్లుగా మూతపడింది. అయితే లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్ ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ తుప్పు పట్టిపోయింది. లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. అప్పట్లో పాలశీతలీకరణ కేంద్ర నిర్వహణను కొనసాగించిన పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అసలే జనరేటర్ డోర్లు తెరిచి ఉండటంతో లోన ఉన్న విలువైన మిషనరీ చోరీకి గురయ్యే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు జనరేటర్‌ను మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

నిరుపయోగంగా మంచాలు



గైనిక్ వార్డు సమీపంలో వృథాగా ఇనుప మంచాలు

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో విలువైన ఇనుప మంచాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఆస్పత్రిలోని పాత బిల్డింగ్ పైఅంతస్తులో గైనిక్ వార్డు సమీపంలో గత కొన్ని నెలలుగా ఇనుప మంచాలు మూలన పడేశారు. అందులో కొన్ని మంచాలు విడిభాగాలు (సెట్ చేయని) అలాగే ఉన్నాయి. దీంతో దుమ్ము, ధూళి, బూజు పట్టి వృథాగా మారాయి. కొన్ని వార్డుల్లో మంచాలు సరిగా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని అధికారులు వృథాగా ఉన్న మంచాలను అవసరమైన వార్డులో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

గుంత తవ్వారు .. వదిలేశారు



మరమ్మతుల కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారిన దృశ్యం

పామిడి: పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ సమీపాన గుత్తి బీసీసీ రోడ్డుకు గల సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ పైప్‌లైన్ మరమ్మతుల కోసం ఆ ప్రాజెక్ట్ సిబ్బంది గుంత తవ్వి వదిలేశారు. నాలుగు నెలలైనా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన పాపాన పోలేదు. ఇది ఆ ప్రాజెక్ట్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణికి నిలువుటద్దంగా నిలుస్తోంది. ఈ గుంత లీకేజీ నీటితో నిండి మురికిమయమైంది. ఈ నీటి గుంత గుత్తి బీసీసీరోడ్డుకు ఆనుకొని ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదవశాత్తు చిన్నారులు ఈ నీటి గుంతలో పడితే అంతే సంగతులు. సత్యసాయి ప్రాజెక్ట్ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్‌లో పేరుకున్న అపరిశుభ్రత



బస్టాండ్ ఆవరణలో పందుల సంచారం..

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అపరిశుభ్రత పేరుకుపోయింది. మూడు జిల్లాల కేంద్రంగా ఉన్న తాడిపత్రి ఆర్టీసీ బస్టాండ్ నుంచి రోజూ వందలాది మంది ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంటారు. వారి అవసరాల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, యూరినల్స్ శుభ్రం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దుర్వాసన భరించలేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు ఆరుబయటను బహిర్భూమిగా ఉపయోగించుకుంటున్నారు. మరోవైపు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పందుల గుంపులు ఉంటున్నాయి. బస్టాండ్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రతతో ఉండటంతో పందుల నివాసంగా ఉపయోగించుకుంటున్నాయి. అధికారులు స్పందించి బస్టాండ్‌లో పారిశుధ్యం మెరుగుపరచడంతోపాటు మరుగుదొడ్లను శుభ్రం చేయించాలని ప్రయాణికులు కోరారు.



పుట్లూరులో కలసిన పూర్వ విద్యార్థులు



శింగనమల జెడ్పీ హైస్కూల్‌లో కలసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పుట్లూరు: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే ఆదివారం అనారోగ్యంతో మృతి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు నాగిరెడ్డికి నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, రిటైర్డ్ ఎంఈఓలు సత్యనారాయణ, మాధవ, రిటైర్డ్ ఉపాధ్యాయులు శేషారెడ్డి, నారాయణప్ప, శివారెడ్డితో పాటు విద్యా వలంటీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

శింగనమల: శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 22 సంవత్సరాల తరువాత కలిసిన విద్యార్థులు అప్పటి ఉపాధ్యాయులు చంద్రశేఖర్, లక్ష్మిరెడ్డి, దివాకర్‌రెడ్డి, బంగారప్ప, మధుసూదన్, ఆదినారాయణ, రాంభూపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అప్పటి జ్ఞాకాలను గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు.